క్లుప్తంగా

అధినేతతో ఆత్మీయ భేటీ



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాముల దేవీప్రకాష్, పార్టీ నేత బళ్ల శ్రీను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు.

నేడు, రేపు లేఖర్ల పెన్ డౌన్



మలికిపురంలో వెంకటేశ్వర్లకు వినతిపత్రం ఇస్తున్న దస్తావేజు లేఖర్లు

మలికిపురం: మండల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో దస్తావేజు లేఖర్లు ఈ నెల 19, 20వ తేదీల్లో పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లేఖర్ల సంఘ నాయకులు గురువారం తెలిపారు. పలు డిమాండ్‌లను ప్రభుత్వాన్ని కోరుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి సరైన వివరణ లేకపోవడం వల్ల ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. రిజిస్ట్రార్ వంగలపూడి వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందించారు. సంఘ నాయకులు కంచుస్తంభం వాసు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మలికిపురం: మోరిపోడు సుబ్బమ్మ మిషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మండలంలోని విశ్వేశ్వరయ్యపురంలోని ఇలపకుర్తి వారి మెరక సజీవుని ప్రార్థన మందిరంచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో దంత, కంటి, జనరల్ వైద్య విభాగంలోని రోగులకు వైద్య సేవలను అందించారు.

జగన్‌ను కలిసిన నాయకులు



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన నాగమోహన్‌రెడ్డి తదితరులు

ఆలమూరు: వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జొన్నాడ ఉపసర్పంచ్ నాగమోహన్ రెడ్డి, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి తాడి జగన్నాధరెడ్డి తదితరులు తాడేపల్లిలో బుధవారం సాయంత్రం కలిశారు. రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా నియమించిన జగన్‌కు జగన్నాథరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

త్వరితగతిన రైల్వే లైన్ పూర్తి

మలికిపురం: నర్సాపురం- కోటిపల్లి రైల్వేలైన్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ పేర్కొన్నారు. రాజోలు నియోజకవర్గంలోని గుడిమెళ్లంకలో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైల్వే లైన్‌కు నిధుల కొరత లేదని, అన్ని సాంకేతిక అడ్డంకులు తొలగి పనుల వేగం పెంచేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే ఉభయగోదావరి జిల్లాల మధ్య జాతీయ రహదారి నిర్మాణం, రాజుల్లంక- రామేశ్వరం మధ్య వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణం పనుల కోసం అడ్డంకులు తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మిశ్రమ పంటల సాగుతో అధిక ఆదాయం

కొత్తపేట: వ్యవసాయంలో అధిక దిగుబడులు, భూసార పరిరక్షణకు అంతర పంటలు, మిశ్రమ పంటల సాగు కీలకమని ఏఓ ద్వార కాదేవి తెలిపారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర సెప్టెంబర్ థీమ్ గ్రీన్ ఏపీలో భాగంగా గురువారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కేపీ రాజు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మిశ్రమ పంటల సాగుతో నీరు, పోషకాలు, సూక్ష్మరశ్మి వంటి వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు సహాయపడతాయన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఒక పంట నష్టపోయినా, రెండో పంట ఆదాయం వస్తుందన్నారు.

మహిళల ఆరోగ్య రక్షణకు వైద్య పరీక్షలు

రాజోలు: మహిళల ఆరోగ్య రక్షణ కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని రాజోలు కో-లోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి దివ్య దర్శిని అన్నారు. కడలి అరవపాలెంలో స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మహిళలకు రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎంపీహెచ్‌ఓ త్రినాథ్, హెచ్‌వీ సుజాత, పంచాయతీ కార్యదర్శి పి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలుపుగోలగా.!

- తెగుళ్లు అధిగమిస్తే ఎక్కువ దిగుబడి
- ఎకరానికి రూ.2 నుంచి 3 వేలు ఖర్చు
- కలత చెందుతున్న రైతులు



గంగలకుర్రులో కలుపు మొక్కలను తీస్తున్న కూలీలు

అంబాజీపేట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు వేసిన సాగులో కలుపు సమస్య రైతులను కలవరపెడుతోంది. వేసవిలో సుమారు 4 నెలలు పాటు చేలను బీడులు చేయడంతో పొలాల్లో కలుపు మొక్కలు, గడ్డి ఎక్కువగా వస్తుందని, దుక్కులు దున్నితే కలుపు రాదని వ్యవసాయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే కలుపు, గడ్డి జాతి వేర్లు అక్కడక్కడ ఉండిపోయి ఖరీఫ్ సాగులో కలుపు ఎక్కువగా వస్తుందని అంటున్నారు. సన్న, చిన్నకారు రైతులు తమ పొలాల్లో కలుపును తొలగించుకోగా.. కొంత మంది కలుపును కూలీలను పెట్టి తొలగిస్తున్నారు. ఎకరానికి ఆరుగురు కూలీలను పెట్టి తొలగిస్తున్నామని, దీంతో రూ.2 వేలు నుంచి రూ.3 వేలు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. అంతే కాకుండా ఇలా కలుపు మొక్కలను తొలగించేటప్పుడు చేలల్లో కలియ తిరగడం వల్ల వరి మొక్కకు ఉన్న వేర్లు తెగి కొత్త వేర్లతో దుబ్బు బాగా చేస్తుందని కొంత మంది రైతులు చెబుతున్నారు. మరి కొంతమంది పంట దెబ్బ తినకుండా కలుపును నిర్మూలించేందుకు మందులను పిచికారీ చేస్తున్నారు. ఈ కలుపు మొక్కలను సకాలంలో నివారించకపోతే పంటకు నష్టం వాటిల్లుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

దిగుబడిపై ప్రభావం

వరి మొక్కలతో కలుపు మొక్కలు అధికంగా పెరిగి భూసారాన్ని అధికంగా గ్రహిస్తుందని వాటిని తొలగించకపోతే ఖర్చు కూడా ఎక్కువగా అయ్యి దిగుబడిపై ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. అంతే కాకుండా ఖరీఫ్‌లో తెగుళ్ల ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్లను ప్రాథమిక దశలోనే గుర్తించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రోజు చేల వద్దకు వెళ్లి రైతులు వరి చేలను పరిశీలించి ఏ తెగులు వ్యాప్తి చెందుతుందో గమనించి వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. తెగుళ్ల ఉధృతిని బట్టి మందులు వాడాల్సి వస్తుందని, పొలాల్లో కలుపును సమర్థంగా నివారించి తెగుళ్లను అధికమించగలిగితే అధిక దిగుబడికి ఢోకా ఉండదని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

ఆదిలోనే నివారించాలి



వరిలో కలుపు నివారించకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుంది. కలుపును నివారించాలంటే ముందుగా చేలల్లోని నీటిని తొలగించి గడ్డి జాతి మొక్కలు ఉంటే సైహలోపాప్ బ్యూటైల్ (క్లించర్) 400 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డిజాతి, వెడల్పాడి ఆకులు ఉంటే బీస్ పైరిబాక్ సోడియం 100 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కలుపు మందులను సరియైన సమయంలో సమ మోతాదులో పిచికారీ చేయాలి.

– కె.ధర్మప్రసాద్, మండల వ్యవసాయాధికారి, అంబాజీపేట.

నియోజకవర్గం	ఎకరాల్లో పంట సాగు
పి.గన్నవరం	25,382
రాజోలు	8,650
కొత్తపేట	34,706

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరంలోని సేవలను పరిశీలిస్తున్న డీఎంఓ వెంకటేశ్వరరావు

మామిడికుదురు: ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంఓ నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. అప్పనపల్లి, మాకనపాలెం గ్రామాల్లో గురువారం ఆరోగ్యవంతమైన మహిళ– శక్తివంతమైన కుటుంబ కార్యక్రమం జరిగింది. మాకనపాలెంలో జరిగిన కార్యక్రమంలో డీఎంఓ పాల్గొన్నారు. పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. మహిళల్లో వచ్చే క్యాన్సర్‌ను ముందే గుర్తించడం వల్ల దాన్ని నివారించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు గెద్దం మంగాలక్ష్మి, మద్దాల బాబూరావు, ఎంపీటీసీ వలవల పెదబాబు, డాక్టర్లు జాన్ లెవీ, సత్యవతి, ఆయుర్వేద డాక్టర్ కనకదుర్గ, పీహెచ్‌సీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కళాశాలలు అమ్మేసి సంపద సృష్టిస్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సూర్యారావు

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మామిడికుదురు: సంపద సృష్టిస్తానంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎక్కడ సంపద సృష్టించారో స్పష్టం చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. మామిడికుదురులో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య స్వగృహం వద్ద గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అమ్మడమేనా సంపద సృష్టి అంటే అని గొల్లపల్లి ప్రశ్నించారు. అధికారం చేపట్టి 15 నెలలు దాటింది. ఇంతవరకు ఏం సాధించారని నిలదీశారు. రాజధానిలో హైకోర్టు నిర్మాణం పూర్తి చేయకపోగా.. పోలవరం ప్రాజెక్టును భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారన్నారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో అర్థమవుతుందా చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. జగన్ సీఎంగా రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. నాలుగు పోర్టులు, ఆరు ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేశారు. కానీ, మీరు చేసిన ఒక్క ప్రాజెక్టు, పథకం పేరైనా చెప్పండంటూ ప్రశ్నలు సంధించారు. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించాలన్నారు. సమావేశంలో పార్టీ నేతలు కూనపరెడ్డి రాంబాబు, గుబ్బల మనోహర్, కంచి శ్రీరామ్, పినిశెట్టి నాగబాబు, కొల్లాబత్తుల మున్న, సర్కిల్ ముస్తఫా, తులా గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



చక్రవర్తిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



సుధీర్ వర్మ, శ్యాంసన్‌ను సత్కరించిన జగ్గిరెడ్డి

రావులపాలెం: పార్టీ శ్రేణులంతా వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక మెజార్టీలతో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. జగ్గిరెడ్డి స్వగృహం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో మోడేకుర్రు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా మాగపు చక్రవర్తి, అనుబంధ విభాగాల అధ్యక్షునిగా పిల్లి గోవిందరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు చింతపల్లి ఏడుకొండలు (చిన్న), ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నూకపెయ్యి శ్రీనివాసరావు, రైతు విభాగం అధ్యక్షుడిగా ముంగర సూర్యనారాయణ, సోషల్ మీడియా అధ్యక్షుడిగా బండి రవీంద్ర, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా గోగి అనిల్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా చోడప నీడి పార్వతి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారికి ఆయన సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గిరెడ్డిని కలిసిన సుధీర్ వర్మ, శ్యాంసన్

వైఎస్సార్ సీపీ తరఫున కొత్తపేట నియోజకవర్గం నుంచి రాష్ట్ర ఐటీ విభాగం జాయింట్ సెక్రెటరీగా భూపతిరాజు శివ సూర్యనారాయణరాజు (సుధీర్ వర్మ), రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం సెక్రటరీ కొల్లి శ్యాంసన్‌లు ఎన్నికయ్యారు. వారు గురువారం గోపాలపురంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారిని జగ్గిరెడ్డి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. పార్టీ అభ్యున్నతికి పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



మామిడికుదురులో నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

మామిడికుదురు: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యలు పరిష్కారం కోరుతూ వీఆర్‌ఏలు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. నామినీ వీఆర్‌ఏలను పర్మినెంట్ వీఆర్‌ఏలుగా గుర్తించాలని, జీతాలు పెంచాలని, పేస్కేలు, ప్రమోషన్లు వంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసనలో పాల్గొన్నారు. మండల శాఖ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి కె.సత్యనారాయణ, ఎం.సుబ్రహ్మణ్యం, కె.సీతారామయ్య, యు.కొర్లపాటి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: అపరిష్కృతంగా ఉన్న వీఆర్‌ఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వీఆర్‌ఏలు డిమాండ్ చేశారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల వీఆర్‌ఏలు దీక్ష శిబిరాన్ని గురువారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

రాజోలు: పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ వీఆర్‌ఏలు గురువారం రాజోలు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నిరసన దీక్షా శిబిరాన్ని కోనసీమ జిల్లా అధ్యక్షుడు దారపురెడ్డి వీరభద్రం ప్రారంభించారు. పే స్కేలును అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులకు పదోన్నతి కల్పించాలని కోరారు. అలాగే కారుణ్య నియామకాలపై ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు చాగంటి రాజకుమార్, ఉల్లూరి రమణ, సోడదాసు సునీల్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్లు అమలు చేయాలని మండల వీఆర్‌ఏలు కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష శిబిరం ఏర్పాటు చేసి ధర్నా చేశారు. కార్యక్రమంలో పసుపులేటి నారాయణ, బొంతు కనక రత్నం తదితరులు ఆందోళన చేశారు. వీరికి ఆర్ఐ రాయుడు మద్దతు తెలిపారు.

పి.గన్నవరం: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వీఆర్‌ఏలు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేశారు. తమకు పే స్కేలు వర్తింపచేయాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వీఆర్‌ఏలకు వర్తింపచేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ అమలాపురం డివిజన్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, మండల శాఖ అధ్యక్షుడు శ్రీకృష్ణ, యార్లగడ్డ మహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన

పి.గన్నవరం: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహిస్తున్న భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వారి తల్లిదండ్రులకు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జి.మమ్మి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. దివ్యాంగ పిల్లలకు నిర్వహిస్తున్న స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఐఈ కార్యక్రమాలను చూశారు. కార్యక్రమంలో ఎంఈఓలు కోన హెలీనా, వీరభద్రానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రణభేరి



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లోని సమావేశంలో పాల్గొన్న నాయకులు



మామిడికుదురులో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు

అంబాజీపేట: ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఈ నెల 25న విజయవాడలో నిర్వహించే రణభేరి బహిరంగ సభను ప్రతి ఉపాధ్యాయుడు విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర జనరల్ కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ జ్యోతిబసు పిలుపునిచ్చారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా రణభేరి జాతా గురువారం అంబాజీపేటలో ప్రవేశించింది. యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు హాజరై జాతాకు స్వాగతం పలికారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు, విద్యారంగ పరిరక్షణకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలన్నారు. తక్షణం పీఆర్సీ కమిటీని నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు సూర్యనారాయణ, పి.విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సభకు తరలిరండి

మామిడికుదురు: విజయవాడలో జరిగే రణభేరి సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు పిలుపునిచ్చారు. బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో యూటీఎఫ్ ప్రతినిధులు మాట్లాడారు. ఉపాధ్యాయులు జాతాకు ఘనంగా స్వాగతం పలికారు. పేరుకుపోయిన వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జాతాలో జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి కేశవరావు పాల్గొన్నారు.

కొత్తపేట: విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్తంగా రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు, ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు, విద్యారంగ పరిరక్షణకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. అనంతరం హెచ్ఎంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేంద్రకుమార్, ఎంటీవీ సుబ్బారావు, జిల్లా కార్యదర్శి మురళి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు విజయకృష్ణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని పట్టించుకోని మంత్రి లోకేష్

పి.గన్నవరం: ప్రభుత్వ విద్యా రంగాన్ని విద్యాశాఖ మంత్రి లోకేష్ పట్టించుకోవడం లేదని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ విమర్శించారు. విద్యాశాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వంపై యూటీఎఫ్ పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్లో యూటీఎఫ్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఏ రకమైన విద్యా విధానం అమలు అవుతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఉపాధ్యాయుల పరిస్థితి పాఠాలకు తక్కువ, బోధనేతర పనులకు ఎక్కువగా ఉందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం

కొత్తపేట: పేదరిక నిర్మూలనే పీ–4 లక్ష్యమని ఆర్డీవో శ్రీకర్ అన్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలి ఎంపీపీ ప్రధాన ప్రాథమిక స్కూల్ హెచ్ఎం చింతా శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఇద్దరు పేద విద్యార్థుల కుటుంబాలను అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ పీ–4 ద్వారా గురువారం దత్తత తీసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నిత్యావసర సరకులు, ఇతర వస్తువులు ఆర్డీవో అందజేశారు. అనంతరం ఫిజియోథెరపిస్టులు డాక్టర్ మోహిత్, సీత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆధునిక ఫిజియోథెరపి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరరావు, మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు అన్నపూర్ణ, సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఊడిపడిన ప్రభుత్వ కార్యాలయ శ్లాబ్ పెచ్చులు



శ్లాబ్ నుంచి ఊడిపడిపోయిన పెచ్చులు

రాజోలు: మండల పరిషత్ కార్యాలయ శ్లాబ్ పెచ్చులు గురువారం ఒక్కసారిగా ఊడిపడిపోయాయి. అదే బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సమయంలో పడి ఉంటే చాలా మంది గాయపడే వారని ఉద్యోగులు అంటున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు భవనంపై నీరు నిలిచిపోయి శ్లాబ్ లీకవుతోంది. దీంతో పెను ప్రమాదం తప్పిందని కార్యాలయ ఉద్యోగులు అన్నారు. సుమారు ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనంలో సమితి కార్యాలయం నిర్వహిస్తూ ఆపై మండల పరిషత్ కార్యాలయంగా మార్పు చేశారు. శిథిలస్థితికి చేరిన భవనంలో పై అంతస్తు భవనం నిర్మించడంతో పాత భవనంపై ఒత్తిడి పెరిగి శ్లాబ్ పెచ్చులు ఊడి పడిపోయి ఇనుప ఊచలు బయటకొచ్చేశాయి. సర్వసభ్య సమావేశంలో శిథిలస్థితికి చేరిన భవనం తొలగించి కొత్తది నిర్మించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఏ క్షణంలోనైనా భవనం కూలిపోతుందని కార్యాలయ ఉద్యోగులు భయాందోళనతో విధి నిర్వహణ చేస్తున్నారు. తక్షణం అధికారులు స్పందించి శిథిలస్థితికి చేరిన భవనం తొలగించి కొత్తది నిర్మించాలని కోరుతున్నారు.

శ్రీవారి పవిత్రోత్సవాలు ప్రారంభం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త గణేశుల వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో శ్రీవారి పవిత్రోత్సవాలను ప్రారంభించారు. రెండు రోజులు స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తిరుమల తిరుపతి అర్చకుల పర్యవేక్షణలో స్వామికి పూజలు, అభిషేకాలు చేసి, వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

టెన్త్‌లో మొదటి స్థానమే లక్ష్యం



అంబాజీపేటలో విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ సలీమ్‌బాషా

అంబాజీపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను మొదటి స్థానంలో ఉంచడమే లక్ష్యమని డీఈవో షేక్ సలీమ్ బాషా తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌ను ఆయన గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న అన్ని జెడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుని పాఠాలు బోధిస్తున్నారన్నారు. గతేడాది 91 శాతం రాగా.. ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఎంఈఓలు కాంద్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

మహిళల ఆరోగ్యం కుటుంబానికి భద్రత



పినపళ్లలో చిన్నారులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

ఆలమూరు: మహిళలు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం ద్వారా కుటుంబానికి తగిన భద్రత ఉంటుందని కొత్తపేట అడిషనల్ డీఎంహెచ్ఓ ఎం.సుమలత అన్నారు. మండలంలోని పినపళ్లలో ఉన్న శ్రీసంగిత లక్ష్మీకాంతం కల్యాణ మండపంలో సర్పంచ్ సుభాష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు టీకాలు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గుమ్మిలేరులో సర్పంచ్ రాంబాబు, మోదుకూరు సొసైటీ అధ్యక్షుడు ఈదల వీర్రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి వచ్చిన గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. వైద్యాధికారులు కె.భాగ్యశ్రీ, బి.అనంత రామకృష్ణ, సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన జడ్జి



కొత్తపేట సబ్ జైలులో రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి శ్రీలక్ష్మి

కొత్తపేట: స్థానిక సబ్ జైలును రాజమహేంద్రవరం జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) సెక్రటరీ శ్రీలక్ష్మి గురువారం సందర్శించారు. సబ్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితుల వివరాలు, వారి బాగోగుల గురించి జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల సెల్స్‌ను, జైలు ప్రాంగణాన్ని, వంట గదిని, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. నిందితులకు లీగల్ ఎయిడ్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ జీవనాథం, న్యాయవాదులు భాస్కరరావు, పీఎల్‌వీ కృష్ణ, కోర్టు సిబ్బంది, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.